క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో సోమవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పెద్దబండ, ఇండోర్ స్టేడియం, ఆర్టీసీ కాలనీ, పద్మావతి కాలనీ, రిజిస్ట్రేషన్ ఆఫీస్, శ్రీనివాస కాలనీ, జెడ్పీ ఆఫీస్, విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

జేఈఈ ఫలితాల్లో ప్రగతి కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఎమ్.శ్రీను


చరణ్‌ప్రకాశ్

రామగిరి(నల్లగొండ): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన ఎం.శ్రీను 1052, ఆర్.చరణ్‌ప్రకాశ్ 1,933 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఏ.నరేందర్‌బాబు, ఎస్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల శేఖర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

'గౌతమి' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ పుట్ట వెంకటరమణారెడ్డి

రామగిరి(నల్లగొండ): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన గౌతమి జూనియర్ కళాశాల చెందిన విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన పి.నవ్య 705, ఆర్.వినాయక్ 1013, డి.రాంప్రసాద్ 1055, వి.ఉమామహేష్ 2749, జి.లవకుశ్‌రెడ్డి 3197, యం.స్వాతి 5,932వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు చల్లా వెంకటరమణ, కాసర్ల వెంకట్‌రెడ్డి, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అంగడి స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలి


సుప్రీం కోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్‌కు సమస్యను వివరిస్తున్న శ్రీనివాసాచారి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 2840 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని రాష్ట్రీయ శివాజీ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తాడోజు శ్రీనివాసాచారి కోరారు. ఈమేరకు ఆదివారం గోవాలో సుప్రీం కోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్‌ను కలిసి సమస్యను వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నో దశాబ్దాలుగా కూరగాయల అంగడి నిర్వహిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని, కొంత మంది వ్యక్తులు ఆ భూమిలో అక్రమ కట్టడాలను నిర్మించి భూమిని ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా వివరించామని పేర్కొన్నారు. ఈ అంగడి నార్కట్‌పల్లి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై తాను పూర్తి సహకారం అందిస్తానని విష్ణుశంకర్ జైన్ తెలిపినట్లు శ్రీనివాస్‌చారి పేర్కొన్నారు.

బడుగులకు ప్రభుత్వం బాసట


మాట్లాడుతున్న కొండూరు సత్యనారాయణ

నల్లగొండ: తెలంగాణ ప్రభుత్వం బడుగులకు బాసటగా నిలుస్తోందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ, ఎంబీసీ, కుల వృత్తి సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలసాంధ్ర పాలకులు విస్మరించిన కుల వృత్తుల ఆర్థిక బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

59 రోజులుగా కొనసాగుతున్న దీక్ష

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతన నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 59వ రోజుకు చేరింది. దీక్షకు అఖిలపక్ష పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ప్రతి ఇంటికీ 'భగీరథ' నీరు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

రామగిరి(నల్లగొండ): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథతో తాగునీటి సమస్యకు శాశ్వత విముక్తి కలిగిందని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని పానగల్ తాగునీటి శుద్ధీకరణ కేంద్రంలో ఆదివారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా మినరల్స్‌తో కూడిన కృష్ణా నీటిని ప్రతి ఇంటికీ అందిస్తున్నామని, ఈ నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా ఉదయ సముద్రం నీటిలోని మట్టి, బ్యాక్టీరియాలను తొలగిస్తున్నామన్నారు. క్లోరినేషన్ చేశాక 565 కిలోమీటర్ల వరకు ఓహెచ్‌ఆర్‌కు పైపు లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం మిషన్ భగీరథ డీఈ రామకృష్ణ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, ఎంపీపీ కరీం పాషా, జెడ్పీటీసీ చెట్ల వెంకటేశం, సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, మిషన్ భగీరథ సీఈ మధుబాబు, ఈఈలు వంశీకృష్ణ, యాదయ్య, డీఈ నర్సింహ, పంచాయతీ రాజ్ ఈఈ తిరుపతయ్య, స్పెషల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ నీటిని అందించి నల్లగొండలో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టారని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో ఆదివారం మిషన్ భగీరథ పంప్ హౌస్ ఆవరణలో మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు మంచినీటి కోసం కాలనీల్లో చేతి పంపులు, వ్యవసాయ బావుల వద్ద నీటి గోస పడుతూ ఆడబిడ్డలు కన్నీరు కార్చేవారని, నేడు ప్రత్యేక రాష్ట్రంలో ఇంటింటికీ భగీరథ నీరు సరఫరా అవుతుండడంతో ఆ పరిస్థితి లేదన్నారు. అనంతరం ఆరుగురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీపీలు ఏడుదొడ్ల శ్వేత, మెండు మోహన్‌రెడ్డి, పల్లె కల్యాణి, గుత్తా ఉమాదేవి, మాల్ మార్కెట్ చైర్మన్ దంటు జగదీశ్, జెడ్పీటీసీలు, రైతుబంధు మండల కన్వీనర్లు, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శేషుకుమార్, వైద్యాధికారి ఇక్బాల్, మిషన్ భగీరథ డీఈ రవికుమార్, పంప్‌హౌస్ మెగా కంపెనీ దుర్గప్రసాద్, ఏఈలు సతీష్‌రెడ్డి, రామచంద్రయ్య, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కనగల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కనగల్ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి ట్యాంకుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పంచాయతీ కార్మికులను సత్కరించారు. రేగట్టేలో గత 20 సంవత్సరాల నుంచి గ్రామ వాటర్‌మెన్‌గా సేవలందిస్తున్న విజయ్‌ను పంచాయతీ పాలకవర్గం, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మిషన్ భగీరథ నీటితోనే ఫ్లోరైడ్ రూపుమాపడం జరిగిందని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మర్రిగూడలో మంచినీళ్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఝాన్సీ, సర్పంచ్ నల్ల యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శాలిగౌరారం మండలంలో ఆదివారం తెలంగాణ మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకుల వద్ద సంబరాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఎర్ర రణీల, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్విని, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ ఎంపీపీ కందుల అనితారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చండూరు, గట్టుప్పల మండలాల పరిధిలో ఆదివారం మంచినీటి పండుగ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఉత్సవాలను ఎంపీడీఓ యాకూబ్ నాయక్ పర్యవేక్షించారు.

కేతేపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కేతేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండగ నిర్వహించారు. ఈసందర్భంగా మంచినీటి ట్యాంకులను అలంకరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక, ఆయా గ్రామాల సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, జటంగి ముత్తమ్మ, కోట వెంకటేశ్వరావు, గోలి మంజుల, బచ్చు జానకిరాములు, జాల వెంకట్‌రెడ్డి, కట్ట శ్రవణ్, చల్ల పూలమ్మ, సీటీ ప్రసాద్, కొండ సరిత, అశ్విని, ఎడ్ల పార్వతమ్మ, జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


నాంపల్లిలోని లింగోటం గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



కనగల్: రేగట్టెలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు


కేతేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పంచాయతీ సిబ్బంది


శాలిగౌరారం: తిరుమలరాయునిగూడెంలోని మిషన్ భగీరథ ట్యాంకు వద్ద..


తేరట్‌పల్లి గ్రామంలో మంచినీటి దినోత్సవంలో పాల్గొన్న ప్రజలు

మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్కకు సన్మానం

నకిరేకల్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం నల్లగొండ నియోజకవర్గంలోని చందనపల్లికి చేరింది. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండేటి మల్లయ్య కలిసి సన్మానించారు. ఆయన వెంట డీసీసీ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, టీపీసీసీ డెలికేట్ నర్సింహయాదవ్, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న ఉన్నారు.


చందనపల్లిలో మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న కొండేటి మల్లయ్య

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


నగదు అందజేస్తున్న పిల్లి రామరాజు

కనగల్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు అన్నారు. ఆదివారం కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో ముత్యాలమ్మ ఆలయానికి రూ.20వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో సోము సోక్కయ్య, మన్నెం రాంబాబు, కారింగు వెంకటయ్య, చంద్రమౌళి, శంకర్, గంజి శంకరయ్య, రాపోలు వెంకటేశ్, రవికుమార్, సురవరం దామోదర్, కారింగు బచ్చయ్య, లింగాల తిరుమల్‌రెడ్డి, మండలి కృష్ణ, సోము అర్జున్, చింటూ, లక్ష్మణ్, పవన్, అనిల్, సత్తయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

నార్కట్‌పల్లి: శ్రద్ధతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండోట సోము అన్నారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అద్దంకి తేజస్విని, దాసోజు గాయత్రిలకు ఆదివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దూదిమెట్ల సత్తయ్య, తెలంగాణ గిడ్డంగుల శాఖ రీజినల్ మేనేజర్ అద్దంకి కృష్ణమాచారి, దేవాలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మాచారి, వైస్ చైర్మన్ గుంటోజు రమేష్, చొల్లేటి శ్రీనివాస్, గడుగోజు సత్యనారాయణ, అర్చకుడు ఉత్తరపెల్లి అనంతచారి, గడ్డం సత్తయ్య, ప్రజ్ఞాపురం పద్మ తదితరులున్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న సోము తదితరులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీలోని 17వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన వంటిపాక రాములు, పద్మానగర్‌లో వడదెబ్బతో మృతి చెందిన గంజి రమేష్‌ల మృతదేహాలను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదివారం సందర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కడపర్తి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన చెడిపల్లి లింగమ్మ మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట సోమా యాదగిరి, రాచకొండ వెంకన్న, పల్లె విజయ్, గుర్రం గణేష్ తదితరులున్నారు. అదే విధంగా గంజి రమేష్, వంటిపాక రాములు మృతదేహాలకు టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ నివాళులర్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట గాజుల సుకన్య, చిట్టిప్రోలు యాదగిరి, గంజి మారయ్య, యండి యూసుఫ్, చెనగోని రాజశేఖర్, నర్సింగ్ మహేష్, నక్షత్, సతీష్ ఉన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

చండూరు(గట్టుప్పల): కండరాల క్షీణతతో బాధపడుతున్న గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన శాంతికి హైదరాబాద్‌లోని వీ టూ హెల్ప్ యూ సేవా సంస్థ ప్రతినిధులు రూ.30వేల విలువ గల ల్యాప్‌టాప్, రూ.10వేల నగదు ఆదివారం స్థానికంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కృష్ణ తులసి, కృష్ణ ప్రసాద్, లాస్య, గోవర్ధన్ ఉన్నారు.

ప్రాథమిక సహకార బ్యాంకును నాంపల్లికి కేటాయించాలి

నాంపల్లి: గతంలో ప్రాథమిక సహకార బ్యాంకును తిరిగి నాంపల్లి మండలానికి కేటాయించాలని సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నక్క చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాంకు గతంలో నాంపల్లిలో ఉండేదని, అనివార్య కారణాల వల్ల సంబంధిత అధికారులు గుర్రంపోడు మండలానికి తరలించారని పేర్కొన్నారు. మర్రిగూడెం రైతులకు గుర్రంపోడు వెళ్లాలంటే 33 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం



నార్కట్‌పల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ భవనం గత కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంటుంది. గతంలో ఈ భవనంలో ఉర్దూ మీడియం పాఠశాల కొనసాగేది. విద్యార్థులు లేకపోవడంతో భవనం వృథాగా మారింది. దీంతో పాఠశాల ఆవరణలో కంప చెట్లు పెరిగిపోతున్నాయి. మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య సబ్‌సెంటర్, ఫారెస్ట్ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. పాఠశాల భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కళాభారతి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ పక్కన ఉన్న కళాభారతి స్థలాన్ని ఆదివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.93 కోట్లతో కళాభారతి ఆడిటోరియాన్ని నిర్మాణానికి త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతులగా శంకుస్థాపన చేయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, ఏసీపీ నాగిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ జమాల్‌ఖాద్రీ, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

సర్దార్ సర్వాయి పాపన్న, బొమ్మగాని భిక్షం కాంస్య విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గౌడ సంఘం నాయకులు, బొమ్మగాని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. స్పందించిన ఆయన హైదరాబాద్ రోడ్డులోని దొడ్డి కొమరయ్య విగ్రహం వద్ద గల పార్కు స్థలాన్ని పరిశీలించారు. విగ్రహాల ఏర్పాటుకు ఇక్కడ స్థలం అనువుగా ఉందని, త్వరలోనే సర్దార్ పాపన్న, ధర్మభిక్షం కాంస్య విగ్రహాలకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పంకజ్‌యాదవ్, చిట్ల వెంకటేశం, నెల్లికంటి సత్యం, కేవీఎల్, సుంకరి మల్లేష్‌గౌడ్, కటికం సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

26 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం

ధూపదీప నైవేద్య స్కీం పరిధిలోకి మొదటి విడుతగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 26 దేవాలయాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించినట్లు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీఎం కేసీఆర్, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వడ్డెర కాలనీ ప్రజలు

నకిరేకల్: బీఆర్‌ఎస్ పాలనలోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం నకిరేకల్‌లోని 18వ వార్డు వడ్డెర కాలనీకి చెందిన 50 కుటుంబాల వారు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటిక, ప్రహరీ, స్నానపు గదులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో గంగుల సుదర్శన్, గోగుల ఎల్లమ్మ, రూపాని సైదమ్మ, ఆలకుంట్ల వెంకన్న, ధనమ్మ, సంతోష, వరికుప్పల చంద్రయ్య, రూపాని ఇద్దయ్య, ఆలకుంట్ల నర్సింహ, రమేష్, అనిల్, రాములు, యాదమ్మ, గురువయ్య, లక్ష్మి, సత్తమ్మ, రేణుక, ఇస్తారి, ముత్తయ్య, వెంకటేష్‌లతో పాటు మరికొందరు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పెండెం సదానందం, కొండ శ్రీను, రాచకొండ సునిల్, మాద నగేష్, రాచకొండ శ్రవణ్ తదితరులున్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న దండెంపల్లి సత్తయ్య

నల్లగొండ టౌన్: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన ఆర్టీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న వారికి డిపోలో విశ్రాంతి గది ఏర్పాటు చేయాలని, లైసెన్స్‌లు మూడు నెలలకు ఒకసారి కాకుండా సంవత్సరానికి ఒకసారి రెన్యూవల్ చేయాలన్నారు. పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా కల్పించాలన్నారు. అనంతరం డిపో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కట్టా శంకరయ్య, కట్టా మల్లేష్, నీల నర్సింహ, లోయపల్లి గురుమూర్తి, యాదయ్య, నర్సింహ, అశోక్, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

రామగిరి(నల్లగొండ): యోగా సాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురూజీ సంధ్య, ఏచూరి శైలజ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆర్యన్స్ యోగా అండ్ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. అంతకుముందు బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించారు. యోగాతో అధిక బరువు తగ్గడంతో పాటు, బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, మైగ్రేన్, తలనొప్పి వంటి అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, యోగా మ్యాట్, టీ షర్టులు అందజేశారు.


యోగా చేస్తున్న మహిళలు

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పొంచి ఉన్న ప్రమాదం
- విన్నవించినా పట్టించుకోని విద్యుత్ అధికారులు


చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

శాలిగౌరారం: విద్యుత్ తీగలు ప్రమాదాలకు నెలవుగా మారాయి. శాలిగౌరారం మండలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్–2 నంబర్‌గల 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 20 విద్యుత్ వ్యవసాయ మోటార్ల కనెక్షన్లు ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కిందకు వేలాడుతున్నాయి. ఇక్కడే కాకుండా మండలంలో పలు చోట్ల కూడా విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దీంతో రైతులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. ఈ తీగలను సరిచేయాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడేలేడని రైతులు ఆరోపిస్తున్నారు. కిందకు వేలాడుతున్న లైన్లతో పంటలసాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీటిని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

శాలిగౌరారంలోని ఎస్ఎస్–2 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో నాకు వ్యవసాయ బావి ఉంది. అక్కడ విద్యుత్ లైన్ కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఏమరపాటుగా విద్యుత్‌లైన్ కింద నుంచి వెళ్లినా విద్యుత్‌షాక్‌కు గురికావాల్సిందే. సమస్య పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు, సిబ్బందిని కోరాం.

– బట్ట వెంకన్న, రైతు, శాలిగౌరారం.

విద్యుత్ లైన్‌ను సరిచేస్తాం

శాలిగౌరారం ఎస్ఎస్–2 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విద్యుత్‌లైన్‌ను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం కూడా శిథిలావస్థకు చేరుకుంది. కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ వేలాడకుండా చేస్తాం.

– శ్రీధర్, విద్యుత్ ఏఈ, శాలిగౌరారం

నీటి లీకేజీని అరికట్టరూ..

చిట్యాల: పట్టణంలోని హైవే రోడ్డుకు ఆనుకోని సాత్ లైన్ సర్వీస్ రోడ్డులో గల కృష్ణానీటి సంపు వాల్వ్ నుంచి నీరు లీకేజీ అవుతుంది. గత వారం రోజులుగా నీరు వృథాగా పోతుండడంతో ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా తాగునీరు కలుషితం అవుతోంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని నీటి లీకేజీని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డులో వృథాగా పోతున్న నీరు →

